దోమల రొద..తీరని వ్యధ

- మురుగుకాల్వల్లో నిలిచిన నీరు
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- దోమలతో రాత్రివేళ ప్రజల జాగారం

బెల్లంపల్లి: సాధారణంగా వర్ష, శీతాకాలాల్లో దోమల సమస్య తీవ్రంగా ఉంటుంది. ప్రస్తుతం ఎండాకాలం వచ్చేసినా వీటి బెడద తప్పడం లేదు. మురుగునీటి కాలువల్లో నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం దోమలతో ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రివేళ జాగారం చేయాల్సిన పరిస్థితి. మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో దోమల సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా..

అసెంబ్లీ నియోజకవర్గంలో బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, వేమనపల్లి, భీమిని, కన్నెపల్లి మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 114 పంచాయతీలు, ప్రత్యేకంగా బెల్లంపల్లి మున్సిపాలిటీ ఉంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు ఐదేళ్ల పదవీకాలం ముగిసి ఏడాది కావస్తుండగా మున్సిపల్ పాలకవర్గం రద్దయి ఇరవై ఐదు రోజులు గడుస్తున్నాయి. పాలకవర్గాల పదవీకాలం పూర్తయ్యాక ప్రత్యేక అధికారులను నియమించారు. వీరి పర్యవేక్షణలో పంచాయతీలు, మున్సిపాలిటీలో పనులు జరగాల్సి ఉండగా పత్తాలేకుండా పోయారనే విమర్శలు వస్తున్నాయి. చుట్టపు చూపుగా అడపాదడపా ఓసారి ఒకటి, రెండు పంచాయతీలను సందర్శిస్తున్నారు. మున్సిపల్ ప్రత్యేకాధికారి తీరు కూడా ఇందుకు ఏమాత్రం భిన్నంగా లేకపోవడం గమనార్హం. ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీల్లో కార్యదర్శులు ఉన్నా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఏమాత్రం జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ కమిషనర్, ప్రత్యేక అధికారి ఉన్న మాటే కానీ పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ పెట్టకపోవడంతో పుర ప్రజలు దోమలతో సహవాసం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



బెల్లంపల్లి టేకుల బస్తీలోని మురుగునీటి కాలువ



తాండూర్ మసీదువాడలోని మురుగు కాలువ

పూడికతీయించక..బైటెక్స్ స్ప్రే చేయించక

దోమల నివారణ చర్యలు తీసుకోవడంలో అధికారులు కనీస శ్రద్ధ చూపించడం లేదు. మురుగునీటి కాలువలు, రొచ్చుగుంటల్లో బైటెక్స్ స్ప్రే చేయించి లార్వాను నియంత్రించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించడం లేదు. ఇళ్ల పరిసరాల్లో ఫాగింగ్ చేయించడంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. నెలల తరబడిగా మురుగునీటి కాలువలు పూడికతీతకు నోచుకోకపోవడం ప్రజలకు శాపంగా మారింది. కేవలం వర్షాకాలంలో మాత్రమే ఓ మారు పూడిక తీయించి మమ అనిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే పట్టించుకుని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిద్రకు దూరమవుతున్నాం



ఫాగింగ్ చేయించకపోవడంతో మురుగునీటి కాలువల్లో దోమల సంతతి పెరిగింది. ఇంట్లో ఫ్యాన్ వేసుకున్నా దోమలతో నిద్రకు దూరమవుతున్నాం. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– ఆరేపల్లి రమ్య, బెల్లంపల్లి

చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. ఒక్కోసారి రాత్రంతా జాగారం చేయాల్సి వస్తుంది. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. బాధ్యత లేకుండా అధికారులు వ్యవహరించడం సరికాదు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలి.

– గొర్లపల్లి చిరంజీవి, సుభద్రకాలనీ

బస్‌డిపో పనులు వెంటనే ప్రారంభించాలి



పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: చెన్నూర్‌లో ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. నిలిచిపోయిన బస్సు డిపో నిర్మాణ ప్రాంతాన్ని నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బస్సు డిపో పనులు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. న్యాయపరమైన సమస్యతో నిలిచిపోయిన పనులను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చొరవ తీసుకుని ప్రారంభించాలన్నారు. బస్సు డిపో నిర్మాణం పూర్తయితే చెన్నూర్‌తోపాటు కోటపల్లి, వేమనపల్లి, పక్కనే ఉన్న మహారాష్ట్ర వాసులకు మేలు చేకూరుతుందన్నారు. నాయకులు తిరుపతి, అశోక్, సమ్మయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్, రమేశ్, శ్రీపాల్, శివకృష్ణ, రామయ్య, వంశీ ఉన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నస్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సెక్రటేరియట్ సభ్యుడు డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. ఆరుగ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం శ్రీరాంపూర్‌లో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వందరోజుల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలు నెరవేరుస్తామని చెప్పి ప్రజలను మోసగించిందన్నారు. నాయకులు వెంకన్న, అప్పారావు, శంకర్, సుధాకర్, సురేశ్ పాల్గొన్నారు.

గాంధీభవన్‌కు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో నాయకులు

మంచిర్యాలటౌన్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు కులగణన, వర్గీకరణపై శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. హైదరాబాద్‌లో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసం నుంచి డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

సంక్షిప్త వార్తలు

డిగ్రీ విద్యార్థులకు అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలు వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చక్రపాణి, కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, సభ్యులు కనకలక్ష్మి ఉన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

చెన్నూర్: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్–రాణి అలేఖ్య వివాహ మహోత్సవం సందర్భంగా స్థానిక నలగొండ పోచమ్మవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ స్రవంతి దంపతులు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ రవి, బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, సురేశ్, సంతోశ్, సాయి, క్రాంతి, రాజు, రవి, రాజేశ్, సతీశ్ పాల్గొన్నారు.

కులాంతర వివాహాల చట్టం అమలు చేయాలి

పాతమంచిర్యాల: కులాంతర వివాహితుల రక్షణ, వివాహాల ప్రత్యేక చట్టాన్ని అసెంబ్లీలో తీర్మానం చేసి అమలు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కులాంతర వివాహం చేసుకున్న జంటలను సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాజేశం, సంకె రవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు

వేమనపల్లి: పరీక్షల వేళ విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ అన్నారు. మండలంలోని ఆశ్రమోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఎలా చదువుకోవాలి, మానసిక ప్రశాంతత ఎలా పొందాలని శుక్రవారం సూచనలు చేశారు. జాతీయనట్టల నివారణ కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రలను ఏవిధంగా వేసుకోవాలనే దానిపై వివరించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

జైపూర్: ఎస్టీపీపీలో ఇటీవల నిర్మించిన నూతన సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించిన అధికారులను సన్మానించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో శుక్రవారం ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఆలయం నిర్మించిన రామ్‌కుమార్, సుందరం మూర్తి, పెయింటర్ హరిహరన్‌లను సన్మానించి బహుమతులతో సత్కరించారు. జీఎం శ్రీనివాసులు, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్, సెక్రెటరీ సముద్రాల, జీఎంలు ప్రసాద్, పీఎంపీఎల్ హెడ్ అఖిల్‌కపూర్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

జన్నారం: కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ కుమార్ ఆయన్ను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు అంజగౌడ్, భూమన్న ఉన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల జూనియర్ లెక్చరర్లకు ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలని జూనియర్ లెక్చరర్ కొట్టె శ్రీనివాస్ కోరారు. కళాశాల ఆవరణలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఐదునెలల నుంచి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ (ఐఎఫ్‌టీయూ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి జాఫర్ కోరారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో పలువురు కార్మికులతో కలసి చలో హైదరాబాద్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. రాజేశం, రాజేశ్వరి, రుక్మిణి ఉన్నారు.


బొగ్గు ఉత్పత్తికి కృషిచేయాలి

కాసిపేట: గనిలో పది శాతం అధిక బొగ్గు ఉత్పత్తికి కృషిచేయాలని గ్రూప్ ఏజెంట్ రాందాసు, గని మేనేజర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిపై అధికారులు, సూపర్‌వైజర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13న ఒక్కరోజు అత్యధికంగా 443 టబ్బులు ఫిల్లింగ్, 600 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం అభినందనీయమన్నారు. ఉత్పత్తిలో భాగస్వాములైన ఉద్యోగులను అభినందిస్తూ ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలన్నారు. ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక

తాండూర్(బెల్లంపల్లి): తాండూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఎండీ.మక్సూద్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడని హెచ్‌ఎం దుర్గం శ్రీనివాస్ ప్రకటించారు. ఏటా రూ.12 వేలు చొప్పున ఇంటర్మీడియెట్ విద్య పూర్తయ్యే వరకు విద్యార్థి బ్యాంక్ ఖాతాలో జమ కానున్నాయని తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేక బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజీముద్దీన్, రామన్న, జ్యోతి, భరత్, సత్యనారాయణ, అశోక్, వెంకటస్వామి, కృష్ణ, రమేశ్, సంతోష్, నాగరాజు, మహేశ్వరి, గోపి, ఉమామహేశ్వరి, లత, వినోద్‌కుమార్, సత్యవతి, రాజ్యలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మక్క-సారలమ్మ జాతర



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట, సుబ్బరాంపల్లి గ్రామాల సమీపాల్లో సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద జాతర శుక్రవారం ముగిసింది. భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజార్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి ప్రధాన రహదారిపై ఉన్న సమ్మక్క–సారలమ్మ గద్దెలను మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం పగిడిద్దరాజును పూజారి దప్పుచప్పుళ్ల మధ్య గద్దెకు తరలించారు. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమకారుడినే గెలిపిద్దాం'



మాట్లాడుతున్న విద్యార్థి జేఏసీ నాయకులు

చెన్నూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుడు సర్దార్ రవీందర్‌సింగ్‌నే గెలిపించుకుందామని జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేల కోట్ల రూపాయల ఆస్తిపరులను గెలిపిస్తే అక్రమ సంపాదనకు తెరలేపుతారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల, ఆధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిశామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే రవీందర్ సింగ్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారని వివరించారు. జేఏసీ నాయకులు ప్రశాంత్, నరేశ్, అశోక్, ప్రభాకర్, శివ, అఖిల్ పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు ఆ ఇంటికే వెలుగు



మొక్కలు నాటుతున్న సీడీపీవో, చిన్నారులు

చెన్నూర్: ఆడపిల్లల చదువు ఆ ఇంటికే వెలుగు వస్తుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కొత్తగూడెం –2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రసాన చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో సీసీలు, వీవోలకు బాల్య వివాహాల నిరోధక, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. సీడీపీవో మనోరమ, ఏపీఎం ప్రమీల, విజయ, అంగన్‌వాడీ టీచర్ దాసరి లక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి మహాయాగ మహోత్సవం



మాట్లాడుతున్న కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిజీ

నస్పూర్: పట్టణంలో శనివారం నుంచి మార్చి 3వరకు నిర్వహించే 86 వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిజీ తెలిపారు. నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాల వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైష్ణవ ఆయుత చండీ అతిరుద్రం శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం విశ్వశాంతి మహాయోగ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న మహాశివరాత్రి సందర్భంగా 24 గంటలపాటు అహోరాత్ర అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. యాగ నిర్వహణలో సుమారు 600 మంది ఋత్వికులు కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్నారని తెలిపారు. యాగశాల వద్ద ప్రత్యేకంగా 50 అడుగుల శివలింగం, కోదండ రామాలయం, గోవర్ధనగిరి శ్రీకృష్ణుని తాత్కాలిక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జవాన్లకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఫిట్‌నెస్ సెంటర్ సభ్యులు



భీమారంలో కొవ్వొత్తుల ర్యాలీలో యువకులు



చెన్నూర్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: పుల్వామాలోని ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఫిట్‌నెస్ సెంటర్ సభ్యులు శుక్రవారం నివాళులర్పించారు. సభ్యులు దార కుమార్‌స్వామి, తులా ఆంజనేయులు, చంద్రకాంత్, లక్ష్మణ్, శ్రీనాథ్, తోట వెంకటేశ్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

భీమారంలో..

భీమారం: అమరులైన జవాన్లకు ఆత్మశాంతి కలుగాలని కోరుతూ మండలం కేంద్రంలో జాతీయరహదారిపై యువకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. మాజీ సైనికులు, యువకులు పాల్గొన్నారు.

చెన్నూర్: పుల్వామాలో అమరులైన జవాన్లకు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, తెలంగాణతల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు చెన్న నారాయణ, బషీరొద్దీన్, పాతర్ల నాగరాజు, చెన్నూరి శ్రీధర్, చింతల శ్రీనివాస్, చీర్ల సుధాకర్‌రెడ్డి, రాజమలాగౌడ్, తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న నిర్వాహకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బాబు క్యాంపుబస్తీలో ఉన్న శ్రీ వాసవీ పంచాయన క్షేత్ర దేవాలయం సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం శిఖరాలకు కుంభాభిషేకం నిర్వహించారు. అంతకుముందు బజారుఏరియాలో ఉన్న కృష్ణ మందిర్ నుంచి వాసవీ ఆలయం వరకు అష్టోత్తర కలశాలతో భక్తులు తరలివెళ్లారు. నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

పూడిక తొలగించరూ..



భీమారం: మండలంలోని ఆరెపల్లిలోని ఎస్సీ కాలనీలో మురుగుకాలువల్లో పూడిక నిండి దుర్గంధం వస్తోంది. కాలనీ ప్రజలు ముక్కు మూసుకుంటున్నారు. పూడిక తొలగించాల్సిన పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని కార్యదర్శికి వారు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు.

సంబంధిత అధికారి: దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఆరెపల్లి

సెల్ నంబర్: 9700131910

క్లుప్తంగా

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బహిష్కరిస్తున్న న్యాయవాదులు

లక్సెట్టిపేట: రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిపై నిందితుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ మండలకేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బోరుబావి వద్ద మహిళలు శుక్రవారం ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోరుబావికి మోటారు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇంటి అవసరాలకు సరిపోయే నీటికోసం మరో వీధికి వెళ్లి తీసుకువస్తున్నామని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్ తెలిపారు. మంచిర్యాలలో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ పునరుద్ధరణ చేయిస్తానన్నారు. 317 జీవో సమస్య పరిష్కారం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో నిరంతరం పోరాడుతానన్నారు. సమావేశంలో శాంతికుమారి, భుజంగరావు, రాజనర్సుబాపు, రాజావేణు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి'

నెన్నెల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డాక్టర్ అంజిరెడ్డి గెలుపునకు కృషి చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరుకుల నర్సింగ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టో గురించి పట్టభద్రులకు వివరించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, నాయకులు శైలేందర్‌సింగ్, కోట వంశీ, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, మహేశ్, సంతోష్, సతీశ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎస్సై కిరణ్‌కుమార్ శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

జైపూర్: పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానం సంపాదించవచ్చునని ఎంఈవో బి.శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం నేషనల్ బుక్‌ట్రస్ట్ సంచార పుస్తక విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలన్నారు. పిల్లలకు సంబంధించిన అనేక కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్రప్రభుత్వం నేషనల్ బుక్‌ట్రస్టు ద్వారా వివిధ భాషల్లో పిల్లల సాహిత్యాన్ని అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం అమరేందర్, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, తిరుపతి, సత్యనారాయణ, రవీందర్, నేషనల్ బుక్‌ట్రస్ట్ ఇన్‌చార్జి వినోద్ పాల్గొన్నారు.